కలిసి ఉంటే కలదు సుఖం..

కాలనీ అభివృద్ధికి నడుం బిగించిన గాంధీనగర్ వాసులు


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ


ప్రతిజ్ఞ చేస్తున్న కాలనీవాసులు

పెదగంట్యాడ: ముందో మాట.. వెనకో మాట వద్దు.. అందరం ఒకే మాట మీద నిలబడదాం.. ఒక్కటిగా సాగుదామని జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌వాసులు స్పష్టం చేశారు. అంతా కలిసి ఐకమత్యంగా ఉంటూ అభివృద్ధి సాధిద్దామని, కాలనీని అన్ని విధాలా తీర్చిదిద్దుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గాంధీనగర్‌ను అభివృద్ధి చేయాలనే ధృక్పథంతో ఉన్నామన్నారు. రెండేళ్ల క్రితం వరకూ ఈ కాలనీలో అడుగు పెట్టాలంటేనే భయంగా ఉండేదన్నారు. రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉండేవని చెప్పారు. ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో విష కీటకాలు అందులో తిష్ట వేసేవని తెలిపారు. ఈ కాలనీలో సుమారు 400 ఇళ్లు ఉన్నాయని, అయితే అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉండేదన్నారు. ఈ నేపథ్యంలో తాను దీనిపై దృష్టి సారించానని, ఇక్కడి అధ్వాన పరిస్థితులను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ద్వారా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి ఈ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కాలనీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమన్నారు. దీనికి కాలనీ వాసుల మద్దతు అవసరమని చెప్పడంతో వారంతా కరతాళ ధ్వనులతో మద్దతు ప్రకటించారు. అసోసియేషన్ వెంటే తాము ఉంటామని ముక్తకంఠంతో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అవినాష్, దివాకర్, రుషికేష్, ముమ్మన మురళి, శ్రీనివాసరావు, శివన్నాయుడు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పెదగంట్యాడ: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని బీసీ రోడ్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో చిన్నారులకు ఆదివారం పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు కన్నేపల్లి సీతాపతిశర్మ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్షయ తృతీయ విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముట్టడి వాయిదా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న తలపెట్టిన స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సీఎండీ, డైరెక్టర్ల బంగళాల ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేశారు. స్టీల్ ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఏపీ స్టేట్ జాక్ అఖిలపక్ష కార్మిక సంఘాలు చేసిన తీర్మానం మేరకు మే 3న అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా అగనంపూడి, కూర్మన్నపాలెం, గాజువాక, పెదగంట్యాడ ఏరియాల్లో రాస్తారోకోలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పూర్ణ



అగనంపూడి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అగనంపూడికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ(పూర్ణ)ను నియమిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. సామాజికంగా వెనుకబడిన బ్రాహ్మణుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పూర్ణ పేర్కొన్నారు. కష్టపడి పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని మరోసారి రుజువు చేశారన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎంపీ విజయసాయిరెడ్డి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సీతంరాజు సుధాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆనంద్ హైట్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: సింహాద్రి అప్పన్న చందనోత్సవం సందర్భంగా అగనంపూడిలోని ఆనంద్ హైట్స్ అసోసియేషన్ సభ్యులు జాతీయ రహదారిపై మజ్జిగ పంపిణీ చేశారు. సింహాచలం వెళ్లే భక్తులకు మజ్జిగ సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.నాగేశ్వరరావు, గౌరీ శంకరరావు, సత్యనారాయణ, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

అనసూయకు అభినందన


చినజీయర్‌స్వామి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న అనసూయాదేవి

మల్కాపురం: ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో వివిధ కళాశాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎన్‌ఎస్‌ఎస్ సీనియర్ ప్రొగాం అధికారి వై.అనసూయాదేవి వ్యవహరించారు.ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని జరిగిన కార్యక్రమంలో త్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా అనసూయాదేవికి సర్టిఫికెట్ అందజేశారు.

హో డెంటల్ అండ్ స్కిన్ కార్నర్ ప్రారంభం


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: చినగంట్యాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హో డెంటల్ అండ్ స్కిన్ కార్నర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. రోగులకు అత్యున్నత వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఆస్పత్రి వైద్యులు ఎ.హనూజా మాట్లాడుతూ ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా చర్మ, హెయిర్ ట్రీట్‌మెంట్‌లపై 30 శాతం, గోర్ల సేవలపై 20 శాతం డిస్కౌంట్‌లను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు, నాయకులు మంత్రి రాజశేఖర్, ఉప్పలపాటి రాజా పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: చందనోత్సవం సందర్భంగా అప్పన్న నిజరూప దర్శనానికి వచ్చే భక్తులకు గోపాలపట్నం పరిధిలో లైన్ వ్యాపారం చేసే వర్తకులు ఆదివారం గోశాల వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భ్కారరావు ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. సుమారు 5000 మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వర్తక సంక్షేమ సేవా సంఘం సభ్యులు బి. గంగాధరం, పి. దామోదరం, పి. గోవిందరాజు, అప్పారావు, ఎన్‌కే ప్రసాద్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ దారుణం


శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన 801వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పలు విభాగ కార్మికులు కూర్చున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 800 రోజులకు పైగా నిరాటంకంగా ఉక్కు ఉద్యమాన్ని కొనసాగించడం కార్మికుల పోరాట శక్తికి నిదర్శనమన్నారు. ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వమని, నిరంతరాయంగా పోరాటాన్ని విడవకుండా కొనసాగించడం ద్వారా ప్రభుత్వంపై ప్రతిఘటన మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిర్భయంగా ఎదుర్కొంటామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థల జోలి కొస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక నెల పండగ


అన్నసమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి టీడీపీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి నెల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శేఖర్, ప్రధానకార్యదర్శి పెద్దాడ ప్రసాద్, యూత్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాలకు అక్షయ తృతీయ శోభ


గోమాత ఆశీర్వాదం తీసుకుంటున్న భక్తురాలు


ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

మల్కాపురం: అక్షయ తృతీయ, చందనోత్సవం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక దుర్గాగణపతి ఆలయంలో గణపతి హోమం చేశారు. ఇక్కడ కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి,గణపతి తదితర దేవతామూర్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే శ్రీహరిపురంలోని హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిపారు. చందనోత్సవం సందర్భంగా నక్కవానిపాలెంలో సింహాద్రి అప్పన్న ప్రతి రూపంగా కొలిచే తోడపెద్దు (గోమాత)కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు భక్తులు నేలపై పడుకుంటే వారిపై నుంచి తోడపెద్దును దాటించారు. గోమాత దాటితే వారిని ఆశీర్వదించినట్టు ఇక్కడ భక్తులు భావిస్తారు.

పుస్తకం.. మంచి నేస్తం



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: పుస్తకాన్ని మించిన నేస్తం మరొకటి ఉండదని విశాఖ జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. మనం తలదించుకొని పుస్తకాన్ని చదివితే మనల్ని తలెత్తుకుని జీవించే విధంగా ధైర్యాన్ని ఇస్తుందని చెప్పారు. ధన సంపద కన్నా.. జ్ఞాన సంపద గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఒక పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పి, వాటిని చదివించారు. పిల్లలకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.పద్మజ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, ఎన్టీపీసీ దీపాంజలినగర్ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులు తీరంలో ఆట పాటలతో సందడి చేశారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం ఇక్కడ వంతెన కింద సేదతీరారు. సాయంత్రం తీరంలో జలక్రీడలతో ఎంజాయ్ చేశారు.

భక్తులకు వైద్య సేవలు


మహిళకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ వైద్యులు. చిత్రంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సింహాచలంలో కొండ మీద, కొండ కిందన కూడా శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. మహిళా భక్తురాలకు లోబీపీ రావడంతో ఆమెకు డాక్టర్లు ఎన్.పి.నాయక్,డాక్టర్ ఎస్.భాస్కర్ వైద్య సేవలు అందించారు.శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెద వీర్రాజు

సీతంపేట: కథకులు తమ చుట్టూ ఉన్న సమాజం నుంచి కథా వస్తువును తీసుకున్నంత కాలం తెలుగు కథలోని తెలుగుదనానికి కీడు వాటిల్లదని కవి, వైద్య నిపుణుడు ఈదర పెద వీర్రాజు అన్నారు. ఎస్.కె.బాబు సంపాదకత్వంలో 56 మంది రచయితల 56 కథల సంకలనం కథా పరిమళాలు పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి మరడాన సుబ్బారావు, ఎస్.హనుమంతరావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారి డి.శ్రీహరిరాజు, మేడా మస్తాన్‌రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, శిరేల సన్యాసిరావు, పరమేశ్వరరావు, చిన్ని రెడ్డి పాల్గొన్నారు.

హోమియో వైద్యుల నూతన కార్యవర్గం

మహారాణిపేట : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్ వైద్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.బి.కె. సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ రావుల సమక్షంలో 2023–25 సంవత్సరాలకు గాను ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా డాక్టర్ పి.రాఘవేంద్రరావు, కార్యదర్శిగా డాక్టర్ రాజా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.శివకాంతి, నిరంతరం వైద్య విద్యల కన్వీనర్‌గా డాక్టర్ వి.హేమలత, కోశాధికారిగా డాక్టర్ ఎస్. సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఆర్. నర్మదా మానస, డాక్టర్ వి.లక్ష్మీపతిరాజు, డాక్టర్ హెచ్.చాందినీశ్రీ,, డాక్టర్ బి.వి.అభిలాష్, డాక్టర్ సౌజన్య, లేడీ డాక్టర్ల రిప్రజెంటేటివ్‌గా డాక్టర్ బి.శ్రీలిఖిత ఎన్నికయ్యారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆరిలోవ: యోగాతో ప్రతి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆనంద్ మార్గ్ ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూత తెలిపారు. ముడసర్లోవ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఆదివారం ఉచిత యోగా శిబిరం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో వాకర్స్ క్లబ్ సభ్యులతో పాటు స్థానికులు యోగాసనాలు నేర్చుకున్నారు.

26 నుంచి ఇండో-నేపాల్ కరాటే పోటీలు


కరాటే పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు

అక్కిరెడ్డిపాలెం: మే 26, 27, 28 తేదీల్లో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంల్లో డొ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ వాడొ – ర్యూ కరాటే ప్రథమ ఇండో – నేపాల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు 43వ వార్డు కార్పొరేటర్ (ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి), పోటీల నిర్వహణ చైర్మన్ పి.ఉషశ్రీ తెలిపారు. ఆదివారం 68వ వార్డు మిందిలో కరాటే ఛాంపియన్ పోటీల బ్రోచర్‌ను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ జరగనున్న పోటీల్లో నేపాల్ దేశం నుంచి 150 మందికి పైగా కరాటే క్రీడాకారులు, అఫీషియల్స్ హాజరు కానున్నట్లు తెలిపారు. మనదేశం నలుమూలల నుంచి 15 రాష్ట్రాలకు చెందిన 2500 మంది కరాటే క్రీడాకారులు, అఫీషియల్స్ హాజరవుతారని అన్నారు. ఈ పోటీలను ఏపీ వాడొ – ర్యూ అసోసియేషన్ చైర్మన్ బొగ్గ శ్రీను, కె.రంగరాజు, విశ్రాంత ఏసీబీ డీఎస్పీ, సబ్ రిజిస్ట్రార్ కె.రాజు సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ చైర్మన్ కె.బ్రహ్మారెడ్డి, ఎస్.కె.గులాం, అసోసియేషన్ కార్యదర్శి జి.గోపాలరావు, కోశాధికారి బి.వెంకటరావు, కో ఆర్డినేటర్ ఎం.హరినాథరావు, వి.అప్పలరాజు, సీనియర్ కరాటే కోచ్‌లు పాల్గొన్నారు.

చెస్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగరావు తదితరులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తానేటి వనిత

గాజువాక: ఏబీసీ ట్రస్ట్, ఏఎన్నార్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వచ్చేనెల 6, 7 తేదీల్లో గాజువాకలో నిర్వహించనున్న అంధుల రాష్ట్రస్థాయి చెస్ పోటీల పోస్టర్‌ను బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన అంధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా చెస్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంగ వైకల్యం ఆటలకు ఆటంకం కాకూడదన్నారు. అందరూ మనోధైర్యంతో పాల్గొని తమ ప్రతిభను, సత్తాను చాటాలన్నారు. మూడు కేటగిరీల్లో ఈ పోటీలుంటాయని, విజేతల్లో ఒక్కొక్కరికీ రూ.40 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు డాక్టర్ స్వరూప్, ఎ.నరేంద్రనాథ్‌రావు, రంజిత్, శ్రీను, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంలో..

పెదగంట్యాడ: దివ్యాంగుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి టోర్నమెంట్లు దోహదం పడతాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఏబీసీ ట్రస్ట్, ఏఎన్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 6, 7 తేదీల్లో వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న దివ్యాంగుల చెస్ టోర్నమెంట్ పోస్టర్‌ను కొవ్వూరులోని ఆమె కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. డాక్టర్ ఎంఎస్ స్వరూప్, జయరాజు, ఏఎస్ఆర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మంత్రి రాజశేఖర్


ఓనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..


తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

గాజువాక: యువత రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పాతగాజువాక నోవల్ ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రక్తం అందుబాటులో లేక ప్రాణాలు పోయే పరిస్థితి రాకూడదని, రక్తదానానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని కోరారు. ఈ శిబిరంలో 75 మంది యువకులు రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. నోవల్ ఇన్ఫోటెక్ డైరెక్టర్ అవినాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, గుడివాడ శ్రీనివాసరావు, ఎంపీ రాజశేఖర్, రామకృష్ణ, వాసు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

పెదగంట్యాడ: ఓనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దల్లివానిపాలెం జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందిన పెదగంట్యాడకు చెందిన ఎండా ప్రదీప్‌కుమార్ అనే విద్యార్థి జ్ఞాపకార్థం ఆర్మీ మాజీ ఉద్యోగి ఇసరపు అప్పలరాజు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 80 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మన్మథరావు ప్రారంభించారు. సంజీవని వలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తం సేకరించారు.

30 మంది రక్తదానం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో అమ్మ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, వర్మసన్యాసిరావు, డాక్టర్ ప్రభుదాస్, విజయకుమార్, మూర్తి, భాస్కరరావు, రాధా కృష్ణ, చంద్రశేఖర్, సత్యనారాయణ, రమేష్, వసంతరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు


నడక పోటీల్లో పాల్గొన్న వాకర్లు


పోటీ పడుతున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకర్ ఆదినారాయణ స్మారక నడక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ వీటిని ప్రారంభించారు. పోటీల్లో 102 మంది పాల్గొనగా.. వీరిలో 42 మంది మహిళలు ఉన్నారు. 31-40, 41-50, 51-60, 61-70, 71-80, 81-90 వయసుల వారీగా విభజించి మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు జరిపారు. ప్రతి విభాగం నుంచి మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేశారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందిస్తారు. ఈ పోటీల్లో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్, హెల్దీ వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్, మా వాకర్స్ క్లబ్, యూనివర్సల్ హెల్త్‌క్లబ్, ఇతర వాకర్స్ పాల్గొన్నారు. వీరికి ఉదయం ఫలహారాలు అందించారు.